క్లుప్తంగా

నేడు తోట్లవల్లూరులో ఎమ్మెల్యే కైలే పర్యటన

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శుక్రవారం తోట్లవల్లూరు మండలంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉదయం 8 గంటలకు యాకమూరులో గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం, 9.30 గంటలకు పాములలంకలో సిమెంటు రోడ్లు, 11.30 గంటలకు రొయ్యూరులో సిమెంటు రోడ్ల ప్రారంభం, 12.30 గంటలకు బొడ్డపాడులో గ్రామ సచివాలయాలను ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మండవల్లిలో గ్రామసభ

మండవల్లి: మండవల్లిలో జలజీవన్ పనులు ప్రారంభించాలని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. స్థానిక శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన గురువారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, గ్రామస్తులు మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు బి.గోకర్ణయాదవ్, ఉప సర్పంచ్ జె.విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎం.సురేష్, బి.రంగారావు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పమిడిముక్కల: కృష్ణాపురం శివారు ముసలనాయిక పాలెంలో రూ.5 లక్షల అంచనాతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వ నిధులు రూ.20 లక్షలతో గ్రామంలో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు ఎస్టీయూ నాయకులు

గుడివాడ టౌన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఏపీ వజ్రోత్సవాలకు గుడివాడ శాఖ ఉపాధ్యాయులు గురువారం బయలుదేరారు. కర్నూలులో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న వజ్రోత్సవాలకు పెద్ద సంఖ్యలో నాయకులు వెళ్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎంవీఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చంద్రశేఖర్ తెలిపారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు టీఎం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం

- మొత్తం ఏడు విభాగాల్లో పోటీలు
- పూజ చేసి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొడాలి నాని
- తొలిరోజు రెండు పళ్ల విభాగంలో పాల్గొన్న 11 ఎడ్ల జతలు



బండ లాగుతున్న ఎడ్ల జత



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని లింగవరం రోడ్డులో ఉన్న కే కన్వెన్షన్ నగర్‌లో ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు జాతీయస్థాయి పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రెండు పళ్ల విభాగం పోటీలను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో మొత్తం నాలుగు రాష్ట్రాలకు చెందిన రైతులు తమ ఎడ్లను తీసుకువస్తున్నారన్నారు. రెండు పళ్లు, నాలుగు పళ్లు, ఆరు పళ్ల విభాగాలతో పాటు, సేద్య విభాగం, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మొత్తం ఏడు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క విభాగానికి 9 బహుమతులు ఉంటాయని, రెండు పళ్ల విభాగంలో రూ.30 వేల నుంచి రూ.5 వేల వరకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగుతాయని వివరించారు. ఒంగోలు జాతి పశు సంపద అంతరించిపోకుండా రైతులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొడాలి నాని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ పోటీలను తిలంకిచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సీనియర్ నాయకులు పాలడుగు రామ్ ప్రసాద్, దుక్కిపాటి శశిభూషణ్, రూరల్ మండల ఎంపీపీ గద్దె పుష్పరాణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మట్టా నాగమణి, నియోజకవర్గానికి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎడ్ల పోటీల విజేతలు

మొదటిరోజు రెండు పళ్ల విభాగంలో మొత్తం 11 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా మొత్తం 9 విభాగాలలో బహుమతులు అందజేశారు. కన్నిదార రవితేజ చౌదరి ఎడ్లు మొదటి బహుమతి రూ.30 వేలు, బిట్రా కార్తికేయ ఎడ్లు రెండో బహుమతి రూ.25 వేలు, బెల్లంకొండ రామాయమ్మ, కంచనకుర్తి గంగరాజు ఎడ్లు మూడో బహుమతి రూ.22 వేలు, ములకలపల్లి సురేష్ సంధ్య, కె.గోపిరెడ్డి ఎడ్లు నాలుగో బహుమతి రూ.18 వేలు, దండూరి శ్రీరాములు ఎడ్లు ఐదో బహుమతి రూ.15 వేలు, అత్తలూరి లక్ష్మీతిరుపతమ్మ ఎడ్లు ఆరో బహుమతి రూ.13 వేలు, మారెళ్ల నాగేశ్వరరావు, గరికెపాటి వెంకట్ ఎడ్లు ఏడో బహుమతి రూ.10 వేలు, కూతుర్ల దక్షితారెడ్డి, నిషాంత్ రెడ్డి ఎడ్లు ఎనిమిదో బహుమతి రూ.8 వేలు, కైప వెంకటరామిరెడ్డి ఎడ్లు తొమ్మిదో బహుమతి రూ.5 వేలు కైవసం చేసుకున్నాయి.

రైతులకు మేలు చేస్తాం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పెదపారుపూడి: రంగుమారిన ధాన్యానికి కలెక్టర్ పి.రాజాబాబుతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలే చూస్తాన్నని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రంగుమారిన ధాన్యంపై రైతులతో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, సివిల్ సప్లయీ డీఎం రాజులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పాయ,రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కొద్ది రోజుల నుంచి ఆఫ్‌లైన్ లో ప్రభుత్వం కొనుగోలు నిలుపుదల చేయటం ఇబ్బందిగా మారిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కైలే.. రైతుల సమస్యలను పరిష్కరించాలని డీఎం రాజును కోరారు. డీఎం మాట్లాడుతూ మండలంలో ధాన్యం పాయరంగు ఎక్కువగా మారిందన్నారు. పక్క మండలాల్లో మంచిగా ఉన్న ధాన్యంలో రంగుమారిన ధాన్యంకలిసి నాయ్యం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ తుపాను కారణంగా దెబ్బతిని పాయ వచ్చిన ధాన్యానికి సాధ్యమైనంత ఎక్కువ ధర వచ్చేలా అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. లారీలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్ వి. నాగభూషణం, ఎంపీపీ గోగం సురేష్, రైతులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



మొవ్వలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

మొవ్వ: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యాన విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ఆవిష్కరించనున్న నేపథ్యంలో మొవ్వ మండలంలోని గ్రామాల్లో సామాజిక సమతదివాస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. మొవ్వ అంబేడ్కర్‌నగర్‌లో ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, సర్పంచ్ తూము పూర్ణ చంద్రరావు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించి విజయవాడలో జరిగే విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి కె.సోమేశ్వరరావు, ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ జి.శామ్యూల్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ అవనిగడ్డ మహేష్ పాల్గొన్నారు.

పలుచోట్ల సంక్రాంతి సంబరాలు



నిభానుపూడిలో గంగిరెద్దుల వారిని సన్మానిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

నిభానుపూడి(పామర్రు): నిభానుపూడిలో గురువారం ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని ఇళ్ల ముంగిట రకరకాల రంగులతో రంగ వల్లులను తీర్చి దిద్దారు. వీటిలో గొబ్బెమ్మలను పెట్టి గొబ్బి పాటలను పాడారు. ఎంపీపీ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునే విధంగా ప్రతి ఒక్కరూ అన్ని పండుగలను నిర్వహించాలన్నారు. సంక్రాంతి పండుగను ప్రతి ఇంట్లో సంతోషాలతో ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీపీ గంగిరెద్దుల వారిని ఘనంగా సన్మానించారు. వారికి సంక్రాంతి కానుకలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నారులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలుగు ప్రజల అత్యంత ముఖ్యమైన పర్వదినం సంక్రాంతి అని దానిలో భాగంగా రంగవల్లుల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి బీరం వెంకట రమణ తెలిపారు. కార్యక్రమంలో బబిత, సునీత, పూర్ణిమ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కూడార్రై

పామర్రు: ధనుర్మాసంలో 27 రోజులు పూర్తైన సందర్భంగా పలు వైష్ణవ ఆలయాల్లో గురువారం కూడార్రై ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలోని గోదాదేవి రంగనాథ స్వాముల సన్నిధిలో కూడార్రై జరిగింది. తొలుత స్వామివార్లకు విశేషంగా పంచామృతాలతో నవరసాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి శత సహస్రనామాలతో పూజలను చేశారు. అర్చకులు ప్రసాద్, గోపి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

పామర్రు: మండల పరిధిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పీఎస్‌లో గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎలకుర్రు గ్రామానికి చెందిన ఏనుగంటి వీర వెంకట లక్ష్మీనారాయణ పామర్రులోని మద్యం దుకాణాల నుంచి రోజుకు మూడు బాటిల్స్ చొప్పున కొనుగోలు చేసి గ్రామంలో అధిక ధరలకు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఎలకుర్రు ఊరి చివర సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు అతని నుంచి మొత్తం 18 మద్యం బాటిల్స్ సీజ్ చేశామన్నారు. సదరు వ్యక్తి పాత కేసులో ముద్దాయి కావడంతో అతన్ని గుడివాడ కోర్టుకు రిమాండ్ నిమిత్తం హాజరుపరిచామన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

పెదపూడి(మొవ్వ): సంకాంత్రి పండగ అంటే గుర్తుకు వచ్చే జూద క్రీడలకు యువత దూరంగా ఉండి క్రీడా స్ఫూర్తిని పెంపొందించే గ్రామీణ క్రీడలపై మొగ్గు చూపాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సూచించారు. మొవ్వ మండలం పెదపూడి గ్రామంలోని జిమ్ గ్రౌండ్‌లో గొట్టుపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 17 బాలబాలికల ఇన్విటేషన్ గ్రామీణ కబడ్డీ టోర్నమెంట్‌ని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గురువారం ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని మంచి టోర్నీని నిర్వహిస్తున్న గొట్టిపాటి సాయిని అభినందించారు. కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 13 జట్లు పోటీలో పాల్గొనగా తొలి రోజు ఆటలు ఉత్సాహ వాతావరణంలో సాగాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు(కొండలు), పార్టీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, పామర్రు సీఐ సుభాకర్, నాయకులు చిమటా రాఘవేంద్రరావు, కొడాలి మురళి, అమర బాలేశ్వరరావు, ఎస్ఐ సందీప్ పాల్గొన్నారు.

చందన గోదాదేవి



పెరిశేపల్లి(పామర్రు): పెరిశేపల్లిలోని శ్రీ అలవేలుమంగా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని గోదాదేవికి ధనుర్మాసం సందర్భంగా గురువారం భక్తులు చందన అలంకారం చేశారు. ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, బిందెతీర్థం, తిరుప్పావై పారాయణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషంగా ప్రసాదాలను నివేదనలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెరుకూరి వెంకట రత్న గిరిబాబు, భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా



మొవ్వ: గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలు పోటాపోటీగా ఉత్కంఠ వాతావరణంలో సాగుతున్నాయి. రెండో రోజు గురువారం షటిల్, ఖో-ఖో పోటీలను మండల క్రీడాధికారి రామారావు పర్యవేక్షణలో సాగాయి.

మండవల్లి: జెడ్పీ హైస్కూల్‌లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, లోకుమూడిలో క్రికెట్ మండల స్థాయి క్రీడలు జరుగుతున్నాయి. గురువారం పోటీల్లో ఏఎంసీ చైర్మన్ వీర్రాజు, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లిలో రూ.94.50 లక్షలతో అభివృద్ధి పనులు

జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రామంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారంతో 94.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నేత వల్లభనేని బుల్లిబాబు గురువారం తెలిపారు. గ్రామంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.62 లక్షలతో సచివాలయ భవనం, ఆర్బీకే భవన నిర్మాణం పనులు తుది దశలో జరుగుతున్నాయన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.12.50 లక్షలతో గ్రామంలో ఐదు సీసీ రోడ్లను సుమారు 400 మీటర్ల వరకు నిర్మించారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.20 లక్షలతో గ్రామంలో 410 మీటర్ల మేర ఏడు సీసీ రోడ్ల పనులు చేస్తున్నామన్నారు. ఇవి ముళ్లపూడిలో వైఎస్సార్ సీపీ నేత అంజిబాబు ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సహకరిస్తోందని స్పష్టం చేశారు.

రైల్వే ఉద్యోగుల దీక్షలు

గుడివాడ టౌన్: న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. గుడివాడ శాఖ కార్యదర్శి సీహెచ్ శివశంకర్ అధ్యక్షతన జరిగిన దీక్షలో వక్తలు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ్ నాయకులు డి.రమేష్, జె.శ్రీనివాసులు, సీహెచ్ సురేష్, వెంకన్న సుబ్రహ్మణ్యం, రవికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు జరగకుండా పకడ్బందీ చర్యలు

తోట్లవల్లూరు: కోడిపందేల నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కోడిపందేల నిరోధంపై ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కోడిపందేల నిర్వహణకు అనుమతులు లేవని కుసుమకుమారి చెప్పారు. కోడిపందేలు, జూదం జరగకుండా మండల స్థాయి కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వర్ణలత, ఎస్ఐ పి.విశ్వనాథ్, పశువైద్యాధికారిణి డాక్టర్ సాయిపూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని జూదక్రీడల జోలికి ఎవరూ పోవద్దని ఇంగిలిపాకలంకలో ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ గ్రామస్తులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూదాలు ఆడటం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

కైకలూరు: వరసకు బావ అయిన భర్త అన్నయ్య వేధిస్తుండడంతోపాటు, తన భర్త అదనపు కట్నం కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓ వివాహిత కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోకర్ణపురం గ్రామానికి చెందిన అదూరి సుబ్బలక్ష్మి శృంగవరప్పాడు అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తోంది. ఆమెకు దుర్గాప్రసాద్‌తో 23 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ఆయన సోదరుడు సుబ్రహ్మణ్యం లైంగికంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్సై జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రగతి పథంలో గుడివాడ



గుడివాడ టౌన్: గుడివాడ పట్టణం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ప్రజలకు కావలసిన వైద్యం, విద్య రంగాల్లో పరుగులు పెడుతోంది. వ్యవసాయ ఉత్పత్తులకు పుట్టినిల్లు గుడివాడ పట్టణం చిన్నతరహా పరిశ్రమల రంగంలో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు కొత్తగా రూపుదిద్దుకుంటున్నాయి. దీనికి తోడు గౌతమ్, విశ్వభారతి వంటి ప్రైవేట్ పాఠశాలలు పట్టణంలో ఉండటంతో విద్యారంగంలోనూ గుడివాడకు ప్రత్యేకత సంతరించుకుంది. సహజంగా వ్యవసాయం, చేపలు, రొయ్యల ఉత్పత్తులు ప్రధాన అంశాలుగా సాగు జరుగుతున్న నేపథ్యంలో ఆర్థికాభ్యున్నతి సాధిస్తోంది. ఇక వైద్యరంగానికి వస్తే రూ.10 కోట్లతో ప్రభుత్వ ఏరియా హాస్పటల్‌ను 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడం పదుల సంఖ్యలో ప్రైవేట్ ఆసుపత్రులు అందుబాటులోకి రావడంతో వైద్యరంగంలోనూ గుడివాడ ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇక చిన్నతరహా పరిశ్రమలకు ఆటోనగర్ అందుబాటులో ఉండటంతో ఆ దిశగా ముందడుగు వేస్తుంది. ఇక దుస్తులు, ఎలక్ట్రానిక్ గూడ్స్, కార్ల షోరూమ్‌లు, టూ వీలర్ షోరూమ్‌లు, ట్రాక్టర్లు, ట్రాక్టర్ ట్రైలర్లు, వ్యవసాయ రంగ ఉత్పత్తులైన దమ్ము చక్రాలు, కల్టివేటర్‌లు, పడ్లర్, వరి నూర్పుడు యంత్రాలు, సేద్యపు యంత్రాలు, ఉత్పత్తుల్లో గుడివాడ అగ్రస్థానంలో ఉంది.

పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం



విజయవాడ తరువాత చిన్నతరహా పరిశ్రమల్లో గుడివాడకు రెండో స్థానం. వ్యవసాయ పరికరాల తయారీని రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రారంభించిన ఘనత గుడివాడకే దక్కుతుంది. త్వరలో బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే దాని అనుబంధ ఉత్పత్తుల చిన్నతరహా పరిశ్రమలకు గుడివాడ నిలయం కానుంది. ఈ దిశగా పారిశ్రామిక అభివృద్ధికి గుడివాడ కేంద్రం కానుంది.

–నుగలాపు వెంటేశ్వరరావు,
పారిశ్రామికవేత్త

మంచి వైద్యసేవలు అందుతున్నాయి



గుడివాడలో చిన్న పిల్లలకు మంచి వైద్య సేవలు అందుతున్నాయి. చిన్నపిల్లలకు వచ్చే వ్యాధి లక్షణాలను ముందుగానే గమనిస్తే మెరుగైన వైద్యం అందించడం సులభతరమవుతుంది. సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, వెంటిలేటర్ బాక్స్‌లు వంటి అధునాతన పరికరాలతో పాటు అన్ని రకాల టీకాలు, మందులు పట్టణంలో అందుబాటులో ఉండటంతో వైద్యరంగంలోనూ గుడివాడ అభివృద్ధి పథంలో నడుస్తోంది.

–డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి,
నవ్యసాయి పిల్లల ఆసుపత్రి

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



కైకలూరు/ఏలూరు టౌన్: సామాజిక న్యాయం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ఈ నెల 19న విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంపై గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, ఏలూరు డెప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ నేత ఘంటా ప్రసాదరావు, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



కైకలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆలపాడు గ్రామంలో గురువారం ప్రధానమంత్రి ఉజ్వల యోజనలో భాగంగా ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనరు వేంపాటి విష్ణూరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్యాస్‌ను ఆదా చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తోడుగా కొంత సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందన్నారు. కార్యక్రమంలో కృష్ణ వంశీ డీకేవీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాణిక్యాలరావు పీఏసీఎస్ అధ్యక్షుడు శేషావతారం, గ్రామపెద్దలు కొప్పుల ఏడుకొండలు, నల్లగచ్చు బాబులు, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు తదితరులు పాల్గొన్నారు.